రోడ్డే చెరువైంది..

- ముంపునకు గురైన మేకప్పు చెరువు దారి
- ప్రధాన కాలువలో నీరు లాగకపోవడమే కారణం


మోకాళ్లలోతు నీట మునిగిన మేకప్పు చెరువు రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: నీరు ముందుకు కదలక రోడ్డే చెరువు అయ్యింది. రాకపోకలకు అంతరాయంగా మారింది. వర్షాల కారణంగా రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేట గ్రామంలో మేకప్పు చెరువు రోడ్డు ముంపునకు గురైంది. నీరు ఎటూ కదలక వాహనచోదకులకు ఇక్కట్లు తెచ్చింది. మేకప్పు చెరువు నుంచి వరలక్ష్మీ కాలనీ మీదుగా బాలాజీపేటకు వైపునకు వెళ్లే ప్రధాన కాలువ నీరు లాగకపోవడంతో చెరువుతో పాటు రోడ్డు మునిగిపోయింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. హుకుంపేట మేకప్పు చెరువులోకి ఆ గ్రామంతో పాటు, పిడింగొయ్యికి చెందిన మురుగు నీటితో పాటు వర్షం నీరు వచ్చి చేరుతుంది. గతేడాది వరకూ మేకప్పు చెరువు రోడ్డు ముంపునకు గురైంది. అధికారులు, ప్రజాప్రతినిధులంతా కలసి రైతుల పొలంలో నుంచి చిన్నపాటి కాలువ తీసి వరలక్ష్మీ కాలనీ వద్ద కాలువలో నీరు కలిసేలా ఏర్పాట్లు చేశారు. అప్పటి నుంచి మేకప్పు చెరువు రోడ్డు బాగానే ఉంది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గుర్రపుడెక్క, పూడికతీత పనులు సైతం చేపట్టారు. అలాగే ఉపాధి హామీ పథకంలో రూ.8.5 లక్షల ప్రతిపాదనలతో అమృత్ సరోవర్ పథకంలో మేకప్పు చెరువును అభివృద్ధి చేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో పాటు పిడింగొయ్యి, హుకుంపేట గ్రామాలలోని ప్రజల వాడకం నీరు తోడవడంతో మేకప్పు చెరువు మునిగిపోవడంతో పాటు పక్కనే ఉన్న రోడ్డుపై మోకాలులోతు నీరు చేరింది. ఈ రోడ్డు మార్గాన వెళ్లే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలే బొమ్మూరు, హుకుంపేట గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో బాలాజీపేట వైపు కాలువ పూడికలు తీయించారు. అయినప్పటికీ నీరు ముందుకు వెళ్లకుండా వెనక్కి తన్నుతుంది. దీనివల్ల మేకప్పు చెరువులో నుంచి నీరు వెళ్లడం లేదు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వర్షపునీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేక మరికొద్ది రోజులు ముంపు సమస్య ఉండే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.


చెరుకూరి గొడౌన్స్ వద్ద ప్రధాన కాలువలో నీరు లాగక..

నీరు లాగకపోవడంతోనే...



మేకప్పు చెరువు నుంచి మురుగునీరు వరలక్ష్మీ కాలనీ వద్ద ప్రధాన కాలువలో కలుస్తుంది. అయితే వరలక్ష్మీకాలనీ నుంచి బాలాజీపేట వైపు ప్రధాన కాలువలోకి నీరు ముందుకు వెళ్లడం లేదు. అక్కడి నుంచి వెనక్కి తన్నుతుంది. దీనవల్ల మేకప్ప చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురై రోడ్డు పూర్తిగా మునిగింది. వర్షాలు తగ్గిన వెంటనే మేకప్పు చెరువులో నుంచి నీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

– జి.వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి, హుకుంపేట

వైఎస్సార్ సీపీలో కష్టపడే వారికి గుర్తింపు


సాగర్‌ను అభినందించిన కొండబాబు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ అభివృద్ధి సంస్థ స్టేట్ డైరెక్టర్ (ఏపీఐడీసీ) కానుబోయిన సాగర్‌ను ప్రభుత్వం డీఐఈపీసీ (డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ) లో ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించింది. ఈ మేరకు బుధవారం పార్టీ శ్రేణులంతా కలిసి స్థానిక భారత బొమ్మల వద్ద సాగర్ నివాసానికి వెళ్లి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తున్న సాగర్ భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలన్నారు. నాయకులు గారా చంటి, నందం స్వామి, బర్రే సుబ్రహ్మణ్యం, కృష్ణవేణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో చందన మాట్లాడారు. వచ్చే నెల 2న కడియం హైస్కూల్ ఆవరణలో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. పార్టీ నాయకుడు శాకా పట్టాభితో కలసి ఏర్పాటు చేస్తున్న ఈ మేళాలో 21 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. వివిధ కేటగిరీల్లో మొత్తం 1,125 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చందన వివరించారు. అనంతరం జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సాకా పట్టాభి, సాకా సురేష్, గుత్తుల వాసు, గుత్తుల రమేష్, సఫారి నాయుడు, పెయ్యల రాజేష్, తీగిరెడ్డి శ్రీనివాస్, బండి మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్యకు ఘన నివాళి

ప్రకాశంనగర్: స్థానిక తుమ్మలావ శ్రీభావనా ఋషి ఆలయ ప్రాంగణంలోని పద్మశాలీ భవన్‌లో చేనేత పితామహుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రగడ కోటయ్య జయంతిని నగర వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పద్మశాలీ, దేవాంగ, కర్ణభక్త, పట్టుసాలీ, కరికాల భక్త తదితర చేనేత కులాల ప్రతినిధులు హాజరై కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, నగర అధ్యక్షుడు ఇమంది మోహనరావు, నాయకులు కేకే సంజీవరావు, జామిశెట్టి గాంధీ, యరమ్రోతు ధర్మరాజు, చిందం రాధాకిషన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రివర్‌బేలో జరిగిన బీజేపీ జోనల్ సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వచ్చే నెల 10న సర్పంచులు చేపట్టిన పోరాటానికి బీజేపీ తరఫున పూర్తి సహకారం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, పార్లమెంట్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై నిరసన

ప్రకాశంనగర్: మణిపూర్‌లో జరుగుతున్న అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలని బుధవారం స్థానిక శ్యామలా సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ కుకీ తెగకు చెందిన ఇద్దరు ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక లైంగిక దాడి చేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని విమర్శించారు. బాధితులకు న్యాయం చేయాలని, అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు


గెద్దం రాజారెడ్డి (ఫైల్)

ధవళేశ్వరం: ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ధవళేశ్వరం పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం ఇన్నీసుపేటకు చెందిన గెద్దం రాజారెడ్డి (56) తక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి ఎక్కువ వడ్డీకి ఇస్తుంటారు. గత ఏడాదిగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. బుధవారం ఉదయం ఇంటి నుంచి రాజారెడ్డి బయటకు వెళ్లారు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్నిచోట్లా గాలించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ 34వ గేట్ వద్ద రాజారెడ్డి బైక్, చెప్పులు కుటుంబ సభ్యులకు కనిపించాయి. ఈ మేరకు ఆయన కుమార్తె కోమలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కేశవరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లాలాచెరువులో...

కంబాలచెరువు: స్థానిక లాలాచెరువు ప్రాంతానికి చెందిన ఎం.రాంబాబు (44) అదృశ్యంపై ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. తన భర్త మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని సాయి ప్రియాంక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

సత్వర న్యాయ సేవలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు: సత్వర న్యాయ సేవలు అందించడానికి ప్యానల్ లాయర్లు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ప్యానల్ లాయర్లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ సభ్యులతో మోనిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూష కుమారి మాట్లాడుతూ న్యాయ సేవలు అవసరమైన వారికి మెరుగైన, సత్వరమైన పరిష్కారం చూపడం ప్యానల్ లాయర్ల ప్రధాన కర్తవ్యమన్నారు. ఈ విషయంలో సమస్యలు, సందేహాలు ఉంటే వెంటనే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకు రావాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థల చట్టం 1987పై న్యాయవాదులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. సత్వర న్యాయ సేవలతో ప్రజలలో న్యాయ వ్యవస్థపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. రాజమహేంద్రవరంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ చేపట్టిన కేసులు ఏ దశలో ఉన్నాయో న్యాయమూర్తి ప్రత్యూష కుమారి ఆరా తీశారు.

ప్రణాళికతో ఉన్నత లక్ష్యాల సాధన

- కలెక్టర్ మాధవీలత
- హుకుంపేట జెడ్పీ హైస్కూల్‌లో తనిఖీ


బడిలో చేరిన విద్యార్థినికి స్కూల్ బ్యాగ్, పుస్తకాలను అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: చిన్నతనం నుంచి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసిస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. బుధవారం హుకుంపేట జెడ్పీ హైస్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యను నిర్లక్ష్యం చేయరాదని, నిరంతర విద్యాభ్యాసంతో చక్కని భవిష్యత్‌ను అందుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటలైజేషన్ విధానంలో అత్యున్నత విద్యా విధానాన్ని విద్యార్థుల కోసం తీసుకువచ్చిందని మాధవీలత తెలిపారు. ఈ రోజు బడిబయట ఐదుగురు పిల్లలను స్కూల్‌లో చేర్పించారన్నారు. తల్లిదండ్రులు పిల్లల చదువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని తప్పకుండా స్కూల్‌కు పంపేలా చొరవ చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా బోధనకు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, మధ్యాహ్న భోజన పథకం అమలుతో పాటు నాడు–నేడు కింద స్కూళ్లలో మౌలిక సదుపాయాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం పనులను చేపట్టామన్నారు. అత్యున్నత బోధనా పద్ధతులను ప్రవేశపెట్టి ప్రభుత్వం బడులలో డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇకపై సుద్ద ముక్కలతో పనిలేదని, ఐఎఫ్‌పీ సాంకేతిక బోధనా పద్ధతుల ద్వారా నాణ్యమైన బోధనకు అవకాశం ఏర్పడిందన్నారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా, అంతకంటే మిన్నగా ప్రభుత్వ స్కూళ్లలో బోధన పద్ధతులు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్నారని కలెక్టర్ వివరించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. పాఠశాలలో జరుగుతున్న నాడు– నేడు పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, మండల విద్యాశాఖాధికారి–2 చందుకుమార్, హెచ్‌ఎం బీఎస్‌వీఎస్ మూర్తి, హుకుంపేట సొసైటీ మాజీ చైర్మన్ కురుమళ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

‘బంగారుకొండ’తో చిన్నారులకు మేలు


చిన్నారి నాగభూషణాన్ని ఎత్తుకున్న జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బంగారుకొండ కార్యక్రమంతో రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు మేలు జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. బుధవారం బంగారుకొండ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఇన్నీసుపేట వాకా అప్పలస్వామి వీధిలో నివాసం ఉంటున్న చిన్నారి జి.నాగభూషణం ఇంటిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తేజ్‌భరత్ మాట్లాడుతూ నెలరోజుల్లో చిన్నారి నాగభూషణం 600 గ్రాముల బరువు పెరగాడన్నారు. కలెక్టర్ మాధవీలత ఆలోచన, జిల్లా యంత్రాంగం సహకారంతో పౌష్టికాహార లోపం గల పిల్లలను దత్తత తీసుకుని ప్రతినెలా రూ.500 వెచ్చించి ఆరు నెలల పాటు బంగారు కొండ కిట్ అందజేస్తున్నామన్నారు. తద్వారా వారిని సాధారణ స్థితికి తీసుకుని రావడానికి ఇది ఒక చక్కటి అవకాశం అని పేర్కొన్నారు. నాగభూషణం ఇంటికి వెళ్లి తల్లి పద్మకు బంగారుకొండ కిట్ ద్వారా జరిగిన ప్రయోజనంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. 9.8 కిలోల బరువున్న నాగభూషణం 600 గ్రాములు పెరిగి 10.400 కిలోలకు చేరారని జేసీ అన్నారు. బాలమిత్రలు తప్పనిసరిగా ప్రతి బుధవారం వచ్చి పిల్లలలో జరుగుతున్న మార్పులు, పెరుగుదల గమనిస్తారని జేసీ తెలిపారు. గతవారం దత్తత తీసుకున్న బాలురకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌వీ నరసమ్మ, సూపర్‌వైజర్ బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘విలువల పునర్నిర్మాణం’ పుస్తకావిష్కరణ

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ‘విలువల పునర్నిర్మాణం’ అనే పుస్తకాన్ని బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ పోలుమాటి అన్నవరం సత్యనారాయణను ప్రిన్సిపాల్ ప్రశంసించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విలువలు మానవ సమాజ ప్రగతికి సోపానాలని, ప్రపంచ శాంతికి పునాదులు అని అన్నారు. సోషల్ సైన్సెస్‌లో ఘనమైన పరిశోధనలు జరిగితే ఉత్తమ, ఉన్నత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. పరిశోధనల భాండాగారంగా కళాశాలను తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో అకడమిక్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఎంఆర్ గౌతమ్, ఆంగ్ల అధ్యాపకుడు నూజిల్ల శ్రీనివాస్, తెలుగు అధ్యాపకులు షేక్ జరీనా, సముద్రాల, ప్రిస్కిల్ల, కోడె సౌందర్యవతి తదితరులు పాల్గొన్నారు.

పర్స్‌తో సహా బంగారం మాయం

కడియం: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ నగదు, బంగారు ఆభరణాలతో కూడిన పర్స్ మాయమైన ఘటన కడియం మండలం వేమగిరి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దివాన్‌చెరువు గ్రామానికి చెందిన కె.శాంత కుమారి రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట వెళ్లి తిరిగి వస్తున్నారు. రామచంద్రపురం బస్టాండు వద్ద బస్సు ఎక్కారు. టికెట్‌కు డబ్బులు ఇచ్చేందుకు తన బ్యాగులోని పర్స్‌ను తీసి, తిరిగి బ్యాగులో పెట్టుకున్నారు. అయితే వేమగిరి వద్దకు వచ్చేసరికి బ్యాగులోని పర్సు మాయమైనట్లు గుర్తించారు. ఇందులో రూ.50 వేలు, నాలుగు గ్రాముల బంగారు ఉంగరం, నాలుగు గ్రాముల అంజి ఉంగరం మొత్తం రూ.1.70 లక్షల విలువైనవి సొత్తు మాయమైనట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ శివాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైస్తవులకు అండగా ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్


చందన నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్రైస్తవ సంఘ పెద్దలు

ధవళేశ్వరం: స్థానిక సమాధుల తోట వద్ద డ్రైనేజీ నిర్మాణానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. బుధవారం ధవళేశ్వరం ఎస్‌ఎమ్‌ఈ లూథరన్ చర్చి సంఘ కాపరి సరేళ్ల అనిల్‌కిరణ్, సంఘ పెద్దలు తదితరులు చందన నాగేశ్వర్ కలిశారు. సమాధుల తోట వద్ద సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీ నీటితో సమాధులు పూర్తిగా పాడై చాలా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దీనిపై వెంటనే స్పందించిన చందన నాగేశ్వర్ అధికారులతో మాట్లాడి డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. క్రైస్తవులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని నాగేశ్వర్ అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, సంఘ పెద్దలు అయితాబత్తుల ప్రసాద్, రేగుళ్ల రాజు, రేగుళ్ల రఘు, బీర బాబూరావు, అగస్టీన్, సరేళ్ల రాజు, పెన్నాడ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చుతా..

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రాజా

రాజానగరం: టి.టి.డి. సహకారంతో నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. తిరుమలలోని శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఆయన బుధవారం దర్శించుకున్నారు. అనంతరం పాలకమండలి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరెడ్డిని కలుసుకున్నారు. టీటీడీ అమలు చేస్తున్న శ్రీవాణి పథకంలో భాగంగా మంజూరు చేసిన నిధులతో నవ నారసింహ క్షేత్రాలలో ఒకటైన కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.90 లక్షలతో ఐదు అంతస్తుల రాజగోపురం, రూ.1.35 కోట్లతో కల్యాణ మండపం, కొండపైకి రూ.3.75 కోట్లతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్, ప్రాకార మండపం, రూ.33.75 లక్షలతో మెట్ల మార్గం అభివృద్ధి, రూ.28 లక్షలతో గోశాల, రూ.42 లక్షలతో అన్నదాన భవనం పునర్నిర్మాణ పనులు జరుగనున్నాయి. రూ.1.25 కోట్లతో రంగనాథస్వామి ఆలయాన్ని కూడా పునర్నిర్మించాల్సి ఉందని, సత్వరమే ఈ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే కోరారు. సీతానగరం మండలం చినకొండేపూడిలో రూ.1.30 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం, రూ.60 లక్షలతో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాల గురించి కూడా ప్రస్తావించారు. రూ.1.90 కోట్లతో రాజమహేంద్రవరం గోదావరి తీరాన ఉన్న అయ్యప్పస్వామి ఆలయం అభివృద్ధి పనులు, వెలుగుబందలోని నెలకొల్పదలచిన ఆంజనేయస్వామి భారీ విగ్రహం గురించి మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా ఈ పనులన్నింటినీ చేపట్టేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ సుబ్బారెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరెడ్డిని కూడా ఇదే విషయాలపై కలుసుకుని, త్వరగా పనుల ప్రారంభించేలా చూడాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

తిరుమలేశుని సన్నిధిలో ఎమ్మెల్యే రాజా

రాజానగరం: తిరుమల వేంకటేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ తిరుమలేశుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయురారోగ్యాలతో పాటు అభివృద్ధిని ప్రసాదించాలని కోరానని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని, 2019లో కంటే అత్యధిక మెజార్టీతో నియోజకవర్గంలో విజయం సాధించేలా ఆశీస్సులు అందించాలని కలియుగ దైవాన్ని వేడుకున్నారు.


టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

దివ్యాంగుల కమిటీ సభ్యుడిగా బెన్నీ

ప్రకాశంనగర్: దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సలహా కమిటీ సభ్యుడిగా జియోన్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కరస్పాండెంట్ ఎస్.రాజ్ (బెన్నిబాబు)ను కలెక్టర్ కె.మాధవీలత నియమించినట్లు బుధవారం బెన్నీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం –2016 ప్రకారం దివ్యాంగుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి సంబంధించి జిల్లా కలెక్టర్, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీలో తనకు బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

దొండ రైతు దిగాలు

- కిలో రూ.3 మాత్రమే
- ఒక్కసారిగా తగ్గిన ధర


సీతానగరం లంక భూమిలో దొండపాదులు

సీతానగరం: దొండకాయల ధర అమాంతం పడిపోయింది.. దిగుబడులు బాగున్నాయని సంబరపడే లోపే ధర రైతులను నష్టాల పాల్జేసింది. దళారుల చేతుల్లో కూరగాయల రైతులు చిక్కుకుని విలవిలలాడుతున్నారు. కిలో రూ.మూడుకు కొనుగోలు చేసి, దుకాణాల్లో మాత్రం రూ.15 నుంచి రూ.20కు విక్రయిస్తూ పుడమిపుత్రులను నిండా ముంచుతున్నారు. సీతానగరం మండలంలో సుమారు 450 ఎకరాలలో దొండ సాగు చేస్తున్నారు. వంగలపూడి, రామచంద్రపురం, పురుషోత్తపట్నం, సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురంలలోని లంక, గరువు భూములలో సాగు జరుగుతోంది. ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ శిస్తు చెల్లించి దొండ పాదులు పెట్టారు. వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడి వచ్చింది. ధర బాగుంటుందని రైతులు ఆశించారు. పది కిలోల దొండకాయలు రూ.200 వరకూ ఉండే ధర ఒక్కసారిగా పది కిలోలు రూ.30కు పడిపోయింది. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. దొండ విత్తనాలకు, పందిరి కర్రలకు, వైర్లు, పాదుల పెంపకం పెట్టుబడి, కోత కూలీలు, ఎరువులు, పురుగు మందులకు కలపి ఎకరానికి రూ.2 లక్షల ఖర్చు అవుతుంది. దొండ పాదులు రెండేళ్ల వరకూ ఉంటాయి. మొదటి ఏడాది పెట్టుబడి ఎక్కువ అవుతుంది. రెండో ఏడాది పందిళ్లు, కర్రలు వంటివి అవసరం లేనందున పెట్టుబడి తగ్గుతుంది. పాదులు పెట్టిన రెండు నెలల నుంచి దొండకాయలు కాపులోకి వస్తాయి. ఏడాదిలో ఎకరానికి 40 టన్నుల నుంచి 50 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం కిలో దొండ రూ.3 పలకడంతో నష్టాలు వస్తున్నాయని రైతులు అంటున్నారు. కోసే కూలీలకు కూడా డబ్బులు రావడం లేదని వాపోతున్నారు. నిల్వ ఉంచి అమ్మకాలు జరపడానికి వీలులేని పరిస్థితి. ప్రతి వారం కోయాల్సిన దొండ కాయలను పది రోజుల దాటిన అనంతరం కోతలు జరిపి, వాటిని అమ్మినా కోత కూలీ రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు కంటతడి పెడుతున్నారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

దళారుల వల్ల ధర పతనం



ఎకరంన్నర పంట భూమిలో దొండపాదులు పెట్టాను. రూ.రెండు లక్షల వరకూ పెట్టుబడి పెట్టాను. కిలో ధర రూ.3 మాత్రమే ఉంది. దళారుల వల్ల ధర పడిపోయింది. దీంతో నష్టాలు చూస్తున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మట్ట శ్రీనివాస్, రైతు, సింగవరం

కౌలు సొమ్మూ రాదు



ఎకరం దొండపాదులు పెట్టాను. కిలో దొండ రూ.3కు కొనుగోలు చేస్తున్నారు. కౌలు డబ్బులు కూడా రాని పరిస్థితి నెలకొంది. పెట్టుబడి రూ.2 లక్షలు అయింది. అంతా నష్టమే. బయట వ్యాపారులు మాత్రం కిలో దొండ కాయలు రూ.15 నుంచి రూ.20కు అమ్ముతున్నారు. – తోరం శోభన్‌బాబు, కౌలు రైతు, లంకూరు